


రథంపై కొలువుదీరిన కన్యకా పరమేశ్వరి




తిరువణ్ణామలై: వృషభ వాహనంపై పరాశక్తి అమ్మవారు

కనులపండువగా కన్యకా పరమేశ్వరి రథోత్సవం

ప్యారిస్, న్యూస్‌టుడే: జార్జిటౌన్‌లోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఏడవ రోజు అయిన బుధవారం రాత్రి రథోత్సవం కనులపండువగా జరిగింది. ముందుగా చతుర్వేద పారాయణంతో మూలమంత్ర హోమంతో వేడుకలను ప్రారంభించారు. అమ్మవారికి త్రికాల అభిషేకాలు, అలంకరణలు, ఆరాధనలు చేపట్టారు. సాయంత్రం మూలమూర్తిని బంగారు ఆభరణాలతో, ఉత్సవమూర్తిని రథంపై కొలువుదీర్చి వివిధ రకాల పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కలిగించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ప్రియ సుభాష్ వినోదిని, తెలుగు తరుణి బృంద సభ్యుల భక్తి గీతాలాపన, సవితా గిరి వీణా విన్యాసం, శోభన మెంటా భరతనాట్యం రంజింపచేశాయి. బుధవారం ఉత్సవానికి జెమ్ అండ్ కంపెనీ పెన్ వ్యాపారులు ఉభయదారులుగా వ్యవహరించారు. పాలకమండలి సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పరాశక్తికి వృషభ వాహనసేవ



తిరువణ్ణామలై: తిరువణ్ణామలై అరుణాచలేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వివాహ మండపంలో ఉన్న పరాశక్తి అమ్మవారికి 7వ రోజైన బుధవారం ఉదయం ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, దీపారాధనలు జరిగాయి. సాయంత్రం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి వృషభ వాహనంపై కొలువుదీర్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

టీనగర్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం గజవాహనంపై భక్తులను అనుగ్రహిస్తున్న స్వామివారు - న్యూస్‌టుడే, టీనగర్

నగరమా.. అగ్నిగుండమా!

ఎండలు తగ్గి చల్లబడాల్సిన అక్టోబరు మాసం కాస్తా చెన్నైలో ఆందోళన కలిగిస్తోంది. మనుషులపై తీవ్ర ప్రతాపం చూపుతోంది. తాజాగా జరిగిన ఘటనలు నగరవాసులను కలవరపెడుతున్నాయి. చెన్నైలో అక్టోబరులో ఎండల ప్రభావం ఎక్కువగా ఉండటం ఇదే తొలిసారి కాదని, గతంలోనూ ఇలాగే ఉందని నిపుణులు చెబుతున్నారు. - ఈనాడు-చెన్నై

- ఎండతీవ్రతతో జనం ఉక్కిరిబిక్కిరి
- తాజా ఘటనల నేపథ్యంలో ప్రజల ఉలికిపాటు
- చెన్నైలో బాగా పెరిగిన ఉష్ణోగ్రతలు
- వేడితో సతమతం



అక్టోబరు నెలలో అధిక ఉష్ణోగ్రతలు

సంవత్సరం	ఉష్ణోగ్రత
2023	36.5
2022	35.1
2021	35.9
2020	37.1
2019	34.4
2018	36.4
2017	36.0
2016	36.9
2015	35.7
2014	36.2



బీచ్ రోడ్డులో గొడుగులతో ఎయిర్‌షో వీక్షిస్తున్న జనం


అదో పీడకల

చెన్నై బీచ్‌రోడ్డులో ఈనెల 6న జరిగిన వాయుసేన విన్యాసాలను చూసేందుకు 15 లక్షల మందికిపైగా వచ్చినట్లు అంచనాలు వేస్తున్నారు. తీవ్ర ట్రాఫిక్ సమస్య, గంటలతరబడి దారుల్లోనే చిక్కుకుపోవడం, ఓ పక్క సరి చేయలేని రద్దీ.. మరోపక్క తీవ్ర ఎండ మధ్య 200 నుంచి 300మంది సొమ్మసిల్లిపోయారని అంచనాలున్నాయి. ఐదుగురు మృత్యువాతపడ్డారు. వీరిలో నలుగురు వడదెబ్బకు గురై మరణించారని భావిస్తున్నారు. మరికొందరు ఆసుపత్రుల్లో చికిత్సపొంది డిశ్చార్జయ్యారు. ఈ షో చూసేందుకు వచ్చిన వీక్షకులకు ఆ రోజు పీడకలగానే మారింది.

రికార్డులూ ఈనెలలోనే..

మహానగరంలో ఎండలు చూస్తే అక్టోబరులో మరింత ఎక్కువగా ఉన్నట్లు కనిస్తున్నాయి. ఈ మాసంలో విపరీత ఎండలు కాయడమనేది చెన్నైకి కొత్తేమీ కాదు. 1920లో అక్టోబరు 1వ తేదీన నుంగంబాక్కంలో ఏకంగా 39.4డిగ్రీల సెల్సియస్ నమోదైంది. అప్పట్లో జనాల పరిస్థితి ఊహించలేనిది. గత కొన్నేళ్లుగా ఈ నెలలో అత్యధిక ఉష్ణోగ్రతలు చూస్తే.. 2022లో 35.1డిగ్రీలు, 2023లో 36.5డిగ్రీలు నమోదయ్యాయి.

సైనికులే కూలిపోయారు..



తాంబరంలో భారతీయ వాయుసేన (ఐఏఎఫ్) నిర్వహించిన 92వ వార్షికోత్సవ వేడుకలో పలువురు ఎండ తీవ్రతకు అస్వస్థతకు గురయ్యారు. పరేడ్ చేస్తున్న సమయంలోనే ముగ్గురు సైనికులు సొమ్మసిల్లి పడిపోయారు. వాయుసేనలో ఉన్నవారు దేహదారుఢ్యంతో బలంగా ఉంటారు. ఎలాంటి పరిస్థితులకైనా తట్టుకునేలా వారి శరీరం ఉంటుంది. కానీ అక్టోబరు 8న కాచిన ఎండకు వీరు చాలా ఇబ్బందిపడ్డారు. వారిని స్ట్రెచర్‌పై ఆసుపత్రికి తరలించారు. అలాంటి సైన్యమే ఇబ్బందులు పడుతున్నప్పుడు ఇక ఈ ఎండలకు సామాన్యుల పరిస్థితి ఏంటో చెప్పనక్కర్లేదు.

తాంబరం ఎయిర్‌షో పరేడ్‌లో ఎండ తీవ్రతకు సొమ్మసిల్లి కూర్చున్న వాయు సైనికుడు

కొన్నాళ్లుగా తాళలేనంతగా..

- వారం రోజులుగా నగరంలో ఎండలు తీవ్రంగా ఉన్నాయి. సాధారణ ఉష్ణోగ్రతలతో పోల్చితే 3.7 డిగ్రీల సెల్సియస్ వరకు అదనంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ప్రత్యేకించి ఈనెల 2వ తేదీ నుంచి ప్రభావం ప్రస్ఫుటంగా కనిపిస్తూ వస్తోంది.
- 2వ తేదీ నుంగంబాక్కం, మీనంబాక్కం రెండు చోట్లా 37.1 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. ఈనెలలో ఇప్పటివరకు ఇదే అత్యధికం. 3, 4, 5 తేదీల్లో 35.6 నుంచి 37 డిగ్రీల వరకు నమోదయ్యాయి.
- ఎయిర్‌షో జరిగిన 6వ తేదీ నుంగంబాక్కంలో 34.3, మీనంబాక్కంలో 35 డిగ్రీలుగా నమోదైంది. సాధారణం కన్నా 1.5 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత పెరిగింది.
- ఆ రోజు బీచ్‌రోడ్డుకు ఉదయం 8 గంటల నుంచే ప్రజలు రావడం మొదలుపెట్టారు. రద్దీ తట్టుకోలేక, ట్రాఫిక్‌లో కదల్లేక సాయంత్రం 5 గంటలవరకూ చాలా మంది ఎండలోనే ఉండటం తీవ్ర ప్రభావాన్ని చూపినట్లుగా సాక్షులు చెబుతున్నారు. ఈ మధ్యలో 200 నుంచి 300 మంది వరకు సొమ్మసిల్లిన వారున్నారని, వారికి నీరు అందలేదని వెల్లడిస్తున్నారు. బయట నీళ్లసీసాలు అన్నిచోట్లా దొరక్కపోవడం, ఉన్న చోట లీటరు రూ.60, రూ.70 అమ్మడం లాంటివి కనిపించినట్లు వివరించారు. ఎక్కువసేపు ఎండలో ఉండటంతో పిల్లలు, మహిళలు కుప్పకూలిన దాఖలాలున్నాయి.
- 2003లో సాయంత్రం 4 గంటల తర్వాత ఎయిర్‌షోను నిర్వహించడంతో ఎండ ప్రతాపమేమీ కనపడలేదు. ఈసారి ఉదయం 11 నుంచి 1గంటదాకా నిర్వహించడం విమర్శలకు తావిస్తోంది.
- ఈనెల 7వ తేదీ నుంగంబాక్కం, మీనంబాక్కంలో వరసగా 33.3, 34 డిగ్రీల సెల్సియస్, 8న 33.2, 33.5 డిగ్రీలుగా నమోదైంది. అప్పుడప్పుడు నగరంలో వర్షం పడుతున్నా ఎండ మాత్రం తగ్గడంలేదు. ఉక్కపోత వేధిస్తోంది.



చెన్నైలోని ఓ ఆసుపత్రి వద్ద విలపిస్తున్న మృతుడి బంధువు

ఉగ్రవాద సంస్థ కీలక నేత అరెస్టు

ప్యారిస్, న్యూస్‌టుడే: భారతదేశానికి వ్యతిరేకంగా వేర్పాటువాదాన్ని ప్రచారం చేస్తున్న హిజ్బ్‌ఉత్ తహ్రీర్ సంస్థకు చెందిన వ్యక్తి నహిబ్ ఫైజుల్‌ను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అధికారులు అరెస్టు చేశారు. ఇతను తమిళనాడు, పుదుచ్చేరి హిజ్బ్‌ఉత్ తహ్రీర్ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నట్లు తెలిసింది. గత నెల ఈ కేసు వ్యవహారమై ఎన్ఐఏ అధికారులు చెన్నై, తాంబరం, కన్నియాకుమరిలో 11 మంది అనుమానితుల ఇళ్లలో సోదాలు చేపట్టారు. ఈ సోదాల్లో పలు డిజిటల్ సాధనాలు, నగదు, పుస్తకాలను స్వాధీనం చేసుకున్నారు.

భావి జమ్ముకశ్మీర్‌కు ఇది ఆరంభం



సమర యోధుల విగ్రహాలను ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై, న్యూస్‌టుడే: జమ్ముకశ్మీర్ శాసనసభ ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెస్ కూటమి గెలిచిన నేపథ్యంలో ఆ కూటమికి ముఖ్యమంత్రి స్టాలిన్ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన తన 'ఎక్స్' పేజీలో... ఇది ఇండియా, ప్రజాపాలనకు దక్కిన గెలుపుగా అభివర్ణించారు. జమ్ముకశ్మీర్ రాష్ట్ర హోదా గౌరవాన్ని కేంద్రంలోని భాజపా ప్రభుత్వం హరించిన నేపథ్యంలో దానిని తిరిగి సాధించాలన్న అక్కడి ప్రజల ఆకాంక్షను నెరవేర్చేందుకు అందించిన తీర్పుగా తెలిపారు. ప్రతీ కశ్మీరి నమ్మకాన్ని గౌరవించే, అందరినీ అక్కున చేర్చుకునే భావి జమ్ముకశ్మీర్‌కు ఇది ఆరంభమని పేర్కొన్నారు.

ఇమ్మానువేల్ శేఖర్‌కు నివాళి

చెన్నై: అణచివేతకు గురైన ప్రజల సామాజిక స్వేచ్ఛ కోసం పోరాటాలు చేసిన త్యాగి ఇమ్మానువేల్ శేఖర్ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి స్టాలిన్ తన 'ఎక్స్' పేజీలో ఓ సందేశాన్ని పోస్టు చేశారు. అందులో... ఇమ్మానువేల్ శేఖర్ శతజయంతి సందర్భంగా ఆయన సమాధి ఉన్న పరమకుడిలో విగ్రహంతో కూడిన స్మారక మండపాన్ని నిర్మించనున్నట్లు గత ఏడాది తమ ప్రభుత్వం ప్రకటించిందని గుర్తు చేశారు. ఆయన స్మారక చిహ్నాలు, చరిత్ర, ఆయన నడిపించిన హక్కుల ఉద్యమం తమ సామాజిక న్యాయ ప్రయత్నాలకు ప్రేరణ కలిగిస్తాయని తెలిపారు.


యోధుల విగ్రహాలు ఆవిష్కరణ

చెన్నై: తెన్కాశి, శివగంగై, తిరుప్పూర్ జిల్లాల్లో ఏర్పాటు చేసిన ప్రముఖ యోధుల విగ్రహాలను ముఖ్యమంత్రి స్టాలిన్ సచివాలయం నుంచి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆవిష్కరించారు. వాటిలో తెల్లదొరలకు సింహస్వప్నంగా ఉన్న పులిదేవన్ దళాధిపతి వెణ్ణి కాలాడికి తెన్కాశి జిల్లా నెల్‌కట్టుం సేవల్ గ్రామంలో రూ.50 లక్షల వ్యయంతో, వీర మహిళ వేలు నాచ్చియార్ దళాధిపతి కుయిలికి శివగంగై జిల్లా రాగినిపట్టిలోని ఆమె స్మారకమండపం ప్రాంగణంలో రూ.50 లక్షల వ్యయంతో, స్వాతంత్య్ర సమరయోధుడు, తళి పాళెయకారుడు మలైయాండి వెంగిడుపతి ఎత్తలప్పర్ నాయకర్‌కు తిరుప్పూర్ జిల్లా ఉడుమలైపేట్టై మున్సిపల్ కార్యాలయం ప్రాంగణంలో రూ.2.60 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన విగ్రహాలు ఉన్నాయి. సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి సామినాథన్, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి మురుగానందం, తమిళ అభివృద్ధి, సమాచారశాఖ కార్యదర్శి రాజారామన్ తదితరులు పాల్గొన్నారు.

అవమానించేవారిపై జాలిపడుతున్నాను

ఉదయనిధి స్టాలిన్

సైదాపేట, న్యూస్‌టుడే: తనను అవమానించే వారిపై జాలిపడుతున్నానని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఓ దేవాలయంలో తన చిత్రాన్ని కొంతమంది కాళ్లతో తొక్కే వీడియోను ఉదయనిధి స్టాలిన్ సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. ఇందుకు సంబంధించి ఆయన తన 'ఎక్స్' పేజీలో... తనను అవమానిస్తున్నట్లు భావించి వారి రాజకీయ పరిపక్వత ఇంతే అని చెప్పకనే చెబుతున్న సంగిగల్ (అమాయకులను)ను చూసి జాలి పడుతున్నానని తెలిపారు. సిద్ధాంత వ్యతిరేకులకు మనపై ఎంత కోపం వస్తుందనే దానికి, ద్రావిడ సిద్ధాంతాలను తాను ఎంత చక్కగా పాటిస్తున్నాను అనే దానికి సర్టిఫికెటుగా ఈ ఘటనను తాను చూస్తున్నానని పేర్కొన్నారు. తన చిత్రాన్ని వారు తొక్కడం వల్ల వారి పాదాలు అయినా శుభ్రం అవుతాయన్నారు. దీని గురించి డీఎంకే సోదరులు ఎలాంటి కోపతాపాలకు పోకూడదని సూచించారు.



ఉదయనిధికి చెక్ అందిస్తున్న టాటా సంస్థ ప్రతినిధి

ఛాంపియన్స్ ట్రస్టుకు టాటా సంస్థ రూ.2 కోట్ల విరాళం

సైదాపేట: తమిళనాడు ఛాంపియన్స్ ట్రస్టుకు టాటా పవర్ రెన్యువబుల్ ఎనర్జీ సంస్థ తరఫున రూ.2 కోట్ల విరాళం ప్రకటించారు. బుధవారం ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్‌కు ఇందుకుగాను చెక్‌ను సంస్థ ప్రతినిధులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి తంగం తెన్నరసు, యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖ కార్యదర్శి అతుల్య మిశ్రా, తమిళనాడు క్రీడాభివృద్ధి కమిషన్ సభ్య కార్యదర్శి మేఘనాథ్‌రెడ్డి, టాటా సంస్థ అధికారి దీపేష్ నందా తదితరులు ఉన్నారు.

మద్యం అమ్మకాలను లక్ష్యంగా పెట్టుకోవడం సిగ్గుచేటు: భాజపా

సైదాపేట, న్యూస్‌టుడే: టాస్మాక్ దీపావళి అమ్మకాలను లక్ష్యంగా పెట్టుకోవడం సిగ్గుచేటని తమిళనాడు భాజపా ధ్వజమెత్తింది. తమిళనాడు భాజపా అధికార ప్రతినిధి ఏఎన్ఎస్ ప్రసాద్ విడుదల చేసిన ప్రకటనలో... దీపావళి పండుగను పురస్కరించుకుని టాస్మాక్ మద్యం దుకాణాల్లో విక్రయాలు పెంచాలని అధికారులు లక్ష్యం నిర్ణయించినట్లు వార్తలు రావడం దిగ్భ్రాంతిని కలిగించిందని తెలిపారు. ఇది రాష్ట్ర ప్రజల జీవితాలను పాతాళంలోకి నెట్టే చర్యగా ప్రభుత్వం గుర్తించాలని మండిపడ్డారు. ఓ పక్క ముఖ్యమంత్రి టాస్మాక్ దుకాణాలు విడతలవారీగా మూసేస్తామని చెబుతున్నారని, డీఎంకే కూటమి పార్టీలు కూడా ముఖ్యమంత్రికి వంతపాడుతున్నాయని పేర్కొన్నారు. మరోపక్క దీపావళికి మద్యం విక్రయాలు పెంచాలని లక్ష్యం నిర్దేశించటం అన్యాయమన్నారు. ఇది ప్రజలకు డీఎంకే చేస్తున్న ద్రోహమన్నారు. దీనిని రాష్ట్ర ప్రజలు గ్రహించాలని తెలిపారు.

మూడు పెళ్లిళ్లు చేసుకోవడం సనాతనమా?

ఆంధ్రా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై వాంజినాథన్ ఆగ్రహం

ప్యారిస్, న్యూస్‌టుడే: హిందూ ధర్మంపై తరచూ మాట్లాడే ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మూడు పెళ్లిళ్లు చేసుకోవడం సనాతనమా? అని ఆయనపై ఫిర్యాదు చేసిన న్యాయవాది వాంజినాథన్ ప్రశ్నించారు. పవన్ కల్యాణ్ రెండు రాష్ట్రాల ప్రజల మధ్య విద్వేషాలు ప్రేరేపించేలా మాట్లాడారని తెలుపుతూ ఈ నెల 4న మదురై కమిషనరు కార్యాలయంలో న్యాయవాది వాంజినాథన్ ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై దర్యాప్తు చేయడానికి వాంజినాథన్‌కి సైబర్ క్రైం పోలీసులు సమన్లు పంపారు. దీంతో ఆయన సైబర్ క్రైం పోలీసుల ఎదుట బుధవారం హాజరై ఫిర్యాదుపై వివరణ ఇచ్చారు. పవన్ కల్యాణ్ మాట్లాడిన వీడియో, వార్తాపత్రికలు, జనసేనా పార్టీ యూట్యూబ్‌కి సంబంధించిన లింక్ తదితరాలను సమర్పించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ సనాతనం గురించి మాట్లాడటాన్ని వ్యతిరేకిస్తూ బెదిరించే విధంగా పవన్ కల్యాణ్ మాట్లాడారన్నారు. అంతేకాకుండా తిరుమల లడ్డూ వ్యవహారంలో సంబంధంలేని ముస్లింలు, క్రైస్తవుల గురించి అనుచితంగా మాట్లాడి రెండు రాష్ట్రాల ప్రజల మధ్య విద్వేషాలు ప్రేరేపించేలా, మత సామరస్యానికి విఘాతం కలిగించేలా వ్యాఖ్యానించారని చెప్పారు. పవన్ కల్యాణ్‌పై కేసు నమోదు కాకపోతే కోర్టుని ఆశ్రయిస్తానని, అవసరమైతే ఆందోళన చేపడతానని తెలిపారు. డీఎంకే, కాంగ్రెస్, వీసీకే మొదలైన పార్టీలు పవన్ కల్యాణ్ వ్యాఖ్యలను ఖండించాలన్నారు. ఆయన మాటలకు తమిళనాడు గవర్నర్ మద్దతు తెలిపారన్నారు. తరచూ సనాతనంపై మాట్లాడే పవన్ కల్యాణ్ మూడు పెళ్లిళ్లు చేసుకున్నారని, ఇది సనాతనమా?, దీనిని గవర్నర్ ఆమోదిస్తారా? అని ప్రశ్నించారు.

సామ్‌సంగ్ కార్మికుల అరెస్టు దారుణం: ఈపీఎస్

సైదాపేట, న్యూస్‌టుడే: పలు కోర్కెల సాధనకు సమ్మె చేపడుతున్న సామ్‌సంగ్ పరిశ్రమ కార్మికులను అర్ధరాత్రి అరెస్టు చేయడం దారుణమని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, ప్రతిపక్ష నేత ఎడప్పాడి పళనిసామి తెలిపారు. బుధవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... పరిశ్రమ యాజమాన్యం, ప్రభుత్వం, కార్మికుల మధ్య జరిగిన త్రిముఖ చర్చల్లో పరిష్కారం లభించని నేపథ్యంలో ప్రభుత్వం తరఫున రాజీకుదిర్చినట్లు వార్తలు వచ్చాయని తెలిపారు. అయితే అందుకు నిరాకరించిన కార్మికులు సమ్మె కొనసాగిస్తున్నారని, ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి ఆందోళన పాల్గొంటున్న వారి ఇళ్లలోకి చొరబడి పోలీసులు అరెస్టు చేసినట్లు వచ్చిన వార్తలు దిగ్భ్రాంతి కలిగించాయని తెలిపారు. అరెస్టు చేసినవారిని వెంటనే విడుదల చేయడంతో పాటు సమస్యకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. రవాణా సంస్థల్లో పనిచేసే అన్నా కార్మిక సంఘానికి చెందిన 171 మంది పేద కార్మికులకు పార్టీ 53వ వార్షికోత్సవం సందర్భంగా 17వ తేదీ తలా రూ.లక్ష చొప్పున అందించనున్నట్లు తెలిపారు.

వ్యర్థాలు పారబోసేందుకు ప్రత్యేక స్థలాలు

చెన్నై, న్యూస్‌టుడే: చెన్నై నగరంలో భవన నిర్మాణం, శిథిలాల వ్యర్థాలను చట్టవిరుద్ధంగా పారవేయడాన్ని నివారించడానికి చెన్నై మహానగర కార్పొరేషన్ యంత్రాంగం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా ప్రైవేటు లారీ యజమానులు, ప్రైవేటు వ్యక్తులు, ప్రైవేటు సంస్థలు లబ్ధిపొందేలా అలాంటి వ్యర్థాలను పారబోయడానికి 15 చోట్ల ప్రత్యేక స్థలాలను ఏర్పాటు చేసింది. వ్యర్థాలను పారబోయడానికి ఈ స్థలాలను ఉచితంగా ఉపయోగించుకోవచ్చని ప్రకటించింది. మరిన్ని వివరాల కోసం టోల్‌ఫ్రీ నంబరు 1913ను సంప్రదించాలని కోరింది. బహిరంగ ప్రదేశాల్లో చట్టవిరుద్ధంగా చెత్త, వ్యర్థాలను వేయడం, మురుగునీరు, డ్రైనేజీని జలవనరులు, బహిరంగ ప్రదేశాల్లో విడిచిపెట్టడం వంటి అతిక్రమణలకు పాల్పడేవారికి జరిమానా విధించనున్నట్లు తెలిపింది.

- జరిమానా విధించడానికి డిజిటల్ పరికరాలను జీసీసీ యంత్రాగం అందుబాటులోకి తీసుకురానుంది. ఇప్పటికే 500 పరికరాలను కొనుగోలు చేయగా వాటిని మరో ఒకట్రెండు రోజుల్లో జోన్లలో అందించనుంది. ప్రయోగాత్మక పరిశీలన తర్వాత వాటిని అందుబాటులోకి తీసుకురానుంది.

ఎయిర్‌షో మరణాల వ్యవహారం కారణాల విశ్లేషణకు అవయవాలపై అధ్యయనం

ప్యారిస్, న్యూస్‌టుడే: ఎయిర్‌షో సందర్భంగా కొందరు చనిపోవడానికి కారణాలు తెలుసుకునేందుకు మృతుల అవయవాలు, కణజాలాలను 'విస్రా'గా పిలువబడే ఫోరెన్సిక్ పరిశోధనలకు తరలించారు. ఎయిర్ షో వీక్షించేందుకు వెళ్లిన కొరుక్కుపేటకి చెందిన జాన్, పెరుంగళత్తూర్‌కి చెందిన శ్రీనివాసన్, ఆంధ్రప్రదేశ్‌కి చెందిన దినేష్‌కుమార్, తిరువొత్తియూర్‌కి చెందిన కార్తికేయన్, మరక్కాణంకి చెందిన మణి స్పృహకోల్పోయి మృతిచెందారు. ఈ విషయమై అన్నాస్క్వేర్, ట్రిప్లికేన్, మైలాపూర్, మెరీనా, రాయపేట పోలీస్‌స్టేషన్‌లలో వేర్వేరుగా కేసులు నమోదయ్యాయి. అదేవిధంగా మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించగా గుండెపోటు కారణంగా మృతిచెందారని, ఇందుకు వడదెబ్బ కారణం కావొచ్చని తెలిసింది. ఈ నేపథ్యంలో మృతుల అవయవాలు, కణజాలాలను 'విస్రా' పరిశోధనకు తరలించారు. కామరాజర్ సాలైలో ఉన్న ఫోరెన్సిక్ సైన్సెస్ డిపార్ట్‌మెంట్‌లో ఈ అధ్యయనం జరగనుంది.

రూట్ తల ఘర్షణలో గాయపడిన విద్యార్థి మృతి

ప్యారిస్, న్యూస్‌టుడే: రూట్ తల ఘర్షణలో గాయపడిన విద్యార్థి మృతిచెందాడు. చెన్నైలో రూట్ తల విషయంలో బస్సులు, రైళ్లలో ప్రయాణిస్తున్నప్పుడు విద్యార్థుల మధ్య గొడవలు సాధారణమయ్యాయి. ఈ విషయంలో రాజధాని కళాశాల విద్యార్థి సుందర్‌పై గత 4వ తేదీ పచ్చయప్పన్ కళాశాల విద్యార్థులు దాడిచేశారు. తీవ్రంగా గాయపడిన సుందర్ రాజీవ్‌గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. దీంతో పచ్చయప్పన్, రాజధాని కళాశాలల్లో పోలీసు భద్రత ఏర్పాటు చేశారు. అదేవిధంగా రైల్వేస్టేషన్, బస్టాండ్‌లలో నిఘా ఉంచారు. ఘర్షణకు సంబంధించి పచ్చయప్పన్ కళాశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులను ఇదివరకే పోలీసులు అరెస్టు చేశారు. సుందర్‌పై దాడిచేసినట్లు నమోదు చేసిన కేసుని హత్య కేసుగా మార్చారు. సుందర్ మృతిని ఖండిస్తూ రాజధాని కళాశాలలో విద్యార్థులు ఆందోళన చేపట్టారు. దీంతో కళాశాలకు ఆదివారం వరకు సెలవులు ప్రకటించారు.

ఘర్షణకు పాల్పడితే పదేళ్ల జైలు శిక్ష : రైల్వే పోలీసులు

ప్యారిస్: ఘటన చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్‌లో జరగడంతో ఇకపై విద్యార్థులు ఇలాంటి ఘర్షణలకు పాల్పడకుండా రైల్వేపోలీసులు హెచ్చరికలు జారీచేశారు. సెంట్రల్ స్టేషన్‌లో ఎగ్మూర్ రైల్వే డీఎస్పీ రమేష్, సెంట్రల్ రైల్వే డీఎస్పీ కర్ణన్ తదితరులు విలేకరులతో మాట్లాడుతూ... చెన్నై సెంట్రల్ నుంచి వెళ్లే రైళ్లు బేసిన్ బ్రిడ్జి వద్ద ఆగిన సమయంలో విద్యార్థులు ఒకరిపై ఒకరు రాళ్లతో దాడిచేసుకుంటున్నారని, ఈ విషయమై రైల్వేశాఖను సంప్రదించి సూచించిన రైళ్లను ఆలస్యంగా నడపాలని కోరినట్లు తెలిపారు. రైల్వేస్టేషన్‌లలో సీసీ కెమెరాలు ఉన్నాయని, దాడికి పాల్పడే వారిని గుర్తించి కఠిన చర్యలు చేపడతామన్నారు. ఇలాంటి దాడులకు పాల్పడే వారికి పదేళ్ల జైలు శిక్ష పడుతుందని హెచ్చరించారు.

డీఐజీ, ఎస్పీలను కలిసిన బుస్సీ ఆనంద్

వేళచ్చేరి, న్యూస్‌టుడే: తమిళగ వెట్రి కళగం మొదటి రాష్ట్ర మహానాడు ఈనెల 27న విళుపురం జిల్లా విక్రవాండి సమీపం వి.సాలై ప్రాంతంలో నిర్వహించనున్నారు. నిర్వహణకు ఏర్పాట్లు, వేదిక నిర్మాణ పనులు గత శుక్రవారం భూమిపూజతో ప్రారంభమయ్యాయి. ఇదిలా ఉండగా వేదిక నిర్మాణానికి సంబంధించిన మ్యాప్‌ను పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ మంగళవారం రాత్రి విళుపురం డీఐజీ దిషా మిట్టల్, ఎస్పీ దీపక్ శివాచ్‌ను కలిసి అందజేశారు. ఈ సందర్భంగా మహానాడుకు సంబంధించి మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని డీఐజీ దిషా మిట్టల్ బుస్సీ ఆనంద్‌కు సూచించారు.

పాఠశాలలో మంత్రి ఆకస్మిక తనిఖీ



అల్పాహారం తింటున్న విద్యార్థులతో మాట్లాడుతున్న అన్బిల్ మహేశ్

అరక్కోణం, న్యూస్‌టుడే: రాణిపేట జిల్లా రాణిపేట పట్టణంలోని రాజీవ్‌గాంధీనగర్‌లో ఉన్న యూనియన్ మాధ్యమిక పాఠశాలలో రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్‌మహేశ్ పొయ్యామొళి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి వారి ప్రతిభను తెలుసుకున్నారు. అల్పాహారాన్ని పరిశీలించారు. తర్వాత పాఠశాల ఆవరణలో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని ప్రధానోపాధ్యాయిని ఆదేశించారు. మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.

వేలూర్: వేలూర్ జిల్లా మొనవూర్‌లోని ప్రభుత్వ పాఠశాలకు వెళ్లిన మంత్రి తరగతి గదిలోకెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు. ఉపాధ్యాయిని పాఠాలు చెప్పే విధానం గమనించారు. పాఠశాలకు ఆలస్యంగా వచ్చిన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులను ఆదేశించారు. కనీస వసతులపై ఆరా తీశారు. అనంతరం కేవీకుప్పం ప్రాంతంలోని మరో ప్రభుత్వ పాఠశాలలోనూ తనిఖీ చేశారు.

హరిత ఫాంలలో టమాటా, ఉల్లి విక్రయం

విలివాక్కం, న్యూస్‌టుడే: ఉల్లి, టమాటా ధరలు అమాంతం పెరిగిపోయాయి. చెన్నై కోయంబేడు మార్కెట్‌లో బుధవారం కిలో టమాటా రూ.60 నుంచి రూ.90 వరకు విక్రయిస్తున్నారు. బయటి దుకాణాలలో రూ.70 నుంచి రూ.100 వరకు ఉంది. ధరల నియంత్రణకు ఉల్లి, టమాటాని మహారాష్ట్ర నుంచి దిగుమతి చేసుకొని హరిత ఫాం దుకాణాలలో తక్కువ ధరకు విక్రయించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ దుకాణాలలో ఉల్లి కిలో రూ.40, టమాటా రూ.60కి విక్రయిస్తున్నారు.

సమ్మెలో పాల్గొన్న సామ్‌సంగ్ కార్మికుల అరెస్టు





కార్మికులను అరెస్టు చేసి వ్యాను ఎక్కిస్తున్న పోలీసులు ◆ ప్రమాదానికి గురైన వాహనం

శ్రీపెరుంబుదూర్, న్యూస్‌టుడే: కాంచీపురం జిల్లా శ్రీపెరుంబుదూర్ సమీపం సుంగువారిసత్రం వద్ద సిప్‌కాట్ పారిశ్రామికవాడలో ఉన్న సామ్‌సంగ్ పరిశ్రమలో సుమారు 1200 మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరు పరిశ్రమలో సీఐటీయూ కార్మిక సంఘం రిజిస్టరు చేయాలని, వేతనాలు పెంచాలని, పని గంటలు తగ్గించాలని మొదలైన డిమాండ్లతో గత నెల 9వ తేదీ నుంచి పరిశ్రమ ఎదుట సమ్మెకు దిగారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం నుంచి సంస్థ అధికారులు, కార్మికుల మధ్య జరిగిన చర్చలు విఫలం కావడంతో రాత్రి ఇరువర్గాలతో చెన్నై సచివాలయంలో మంత్రులు టీఎం అన్బరసన్, టీఆర్బీ రాజా, సీవీ గణేశన్, అధికారులు చర్చలు జరిపారు. అయినా కార్మికులు విధులకు హాజరు కాలేదు. ఈ నేపథ్యంలో పోలీసులు మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత సమ్మెలో పాల్గొన్న కార్మికుల ఇళ్లకు వెళ్లి అరెస్టు చేశారు. తరువాత పరిశ్రమ ఎదుట వేసిన పందిరి తొలగించారు. సమ్మెలో పాల్గొంటున్న కార్మికులను బుధవారం టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వ పెరుంతగై, కమ్యూనిస్టు నాయకులు ముత్తరసన్, బాలకృష్ణన్ తదితర పార్టీల నేతలు కలవాల్సి ఉండగా మంగళవారం రాత్రి పోలీసులు కార్మికులను అరెస్టు చేయడం గమనార్హం. ఈ అరెస్టులను సీపీఎం ఖండించింది.

సమ్మె విరమించాలి : మంత్రి తంగం తెన్నరసు

వేళచ్చేరి: కార్మికులు తమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని సీఐటీయూలో ఉన్నవారు సమ్మెను విరమించాలని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి తంగం తెన్నరసు విజ్ఞప్తి చేశారు. బుధవారం మంత్రి చెన్నై సచివాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. కార్మికుల సమస్య పరిష్కారానికి ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని తెలిపారు. ప్రస్తుత నెలవారీ వేతనంతోపాటు ఒక్కో కార్మికుడికి తలా రూ.5 వేలు అదనంగా అక్టోబర్ నెల నుంచి అందజేయనున్నట్లు యాజమాన్యం పేర్కొందన్నారు. విధుల్లో ప్రమాదవశాత్తు మరణిస్తే మృతుడి కుటుంబానికి రూ.లక్ష సాయం, కార్మికులు పయనించే బస్సులకు ఏసీ వసతి, నాణ్యమైన ఆహారం, వైద్య బీమా, ప్రస్తుతం ఇస్తున్న సెలవులతో పాటు ఇళ్లలో శుభకార్యాలు, ఇతర కార్యాలకు అదనంగా సెలవులు మొదలైన కోర్కెలపై సంస్థ యాజమాన్యం సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. సీఐటీయూకు సంబంధించి కోర్టులో కేసు నిల్వలో ఉన్నందున తీర్పు ఆధారంగా కార్మిక సంక్షేమశాఖ తగిన చర్యలు తీసుకుంటుందని, కావున సమ్మెను విరమించాలని కోరారు. ఈ నేపథ్యంలో పలు రాజకీయ పార్టీల నేతలు కార్మికుల అరెస్టును ఖండించారు. వారి కోర్కెలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మినీ వ్యాను బోల్తాపడి కొందరికి గాయాలు

కాంచీపురం: బుధవారం ఉదయం సమ్మెలో పాల్గొనడానికి అనేకమంది కార్మికులు సుంగువారిసత్రానికి వెళ్లారు. అక్కడ కార్మికులను పోలీసులు అరెస్టు చేస్తున్నట్లు తెలుసుకున్నవారు వాలాజాబాద్ వైపు వెళుతున్న మినీ లోడు వ్యాను ఎక్కారు. వాహనం శిరుమాంగాడు వద్ద అదుపుతప్పి బోల్తాపడింది. ఘటనలో అనేక మంది కార్మికులకు గాయాలయ్యాయి. పోలీసులు క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు.

ఉద్యోగ నియామక ఉత్తర్వుల అందజేత



నియామక ఉత్తర్వులు అందిస్తున్న సీఎం స్టాలిన్

చెన్నై, న్యూస్‌టుడే: వ్యవసాయశాఖలో 125 మందికి ఉద్యోగ నియామక ఉత్తర్వులను ముఖ్యమంత్రి స్టాలిన్ అందించారు. వ్యవసాయశాఖలో సహాయ వ్యవసాయ అధికారి ఉద్యోగాలకు తమిళనాడు పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా 83 మందిని ఎంపిక చేశారు. వారికి నియామక ఉత్తర్వులు అందజేత, వ్యవసాయశాఖలో ఉద్యోగ కాలంలో మరణించిన ఉద్యోగుల వారసులు 42 మందికి కారుణ్య ప్రాతిపదికన ఉద్యోగ నియామక ఉత్తర్వులు అందజేసే కార్యక్రమం సచివాలయంలో బుధవారం జరిగింది. సూచనప్రాయంగా 10 మందికి ముఖ్యమంత్రి నియామక ఉత్తర్వులు అందించారు. వెంట మంత్రి ఎమ్మార్కే పన్నీర్‌సెల్వం, వ్యవసాయశాఖ కమిషనరు అపూర్వ, వ్యవసాయశాఖ సంచాలకులు మురుగేశ్ తదితరులు ఉన్నారు.

మేకెదాటు ఆనకట్ట నిర్మాణానికి పుదువై కాంగ్రెస్ వ్యతిరేకం : నారాయణస్వామి

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: మేకెదాటు వద్ద కర్ణాటక ప్రభుత్వం ఆనకట్ట నిర్మించడాన్ని పుదుచ్చేరి కాంగ్రెస్ వ్యతిరేకిస్తుందని మాజీ ముఖ్యమంత్రి నారాయణస్వామి పేర్కొన్నారు. ఆయన బుధవారం పుదుచ్చేరిలో విలేకరులతో మాట్లాడుతూ... పుదుచ్చేరిలో మూసి ఉన్న రేషన్ దుకాణాలను తెరచి అన్ని సరకులు ఇస్తామని చెప్పి, ఇప్పుడు బియ్యం, చక్కెర మాత్రమే ఇస్తామని ముఖ్యమంత్రి రంగసామి చెప్పడం సరికాదన్నారు. కేంద్ర హోంశాఖ మంత్రి ఆదేశాలను రద్దు చేయకుండా రేషన్ దుకాణాలను తెరవడం కుదరదని చెప్పారు. అందుకు ప్రధాని, హోంశాఖ మంత్రిని నేరుగా కలిసి ముఖ్యమంత్రి విన్నవించాలని తెలిపారు.

కేత్తి పట్టణ పంచాయతీకి కేంద్ర పురస్కారం

పలు రకాలుగా ఆదర్శంగా నిలుస్తున్న వైనం

విలివాక్కం, న్యూస్‌టుడే: చెత్తను ఎరువుగా మార్చి కిలో రూ.6కు విక్రయిస్తూ ఆదర్శంగా నిలిచిన కేత్తి పట్టణ పంచాయతీని కేంద్ర ప్రభుత్వ పురస్కారం వరించింది. నీలగిరి జిల్లా ఊటీ కేత్తి పట్టణ పంచాయతీ పరిధిలోని 18 వార్డులలో ప్రతిరోజు సేకరిస్తున్న చెత్తను లారీల ద్వారా వళంమీట్టు పార్కుకు తరలిస్తున్నారు. అక్కడ రబ్బర్, ప్లాస్టిక్, కూరగాయలు, ఎలక్ట్రిక్ వ్యర్థాలతో కూడుకున్న చెత్త నుంచి తడి, పొడి చెత్తను విభజిస్తున్నారు. అనంతరం పొడి చెత్తతో సహజ ఎరువు తయారు చేసి కిలో రూ.6కి విక్రయిస్తున్నారు. ఈ ఎరువుకు రైతుల నుంచి ఆదరణ పెరిగింది. ఈ ఎరువు ద్వారా అధిక మొత్తంలో కూరగాయలు దిగుబడి అవుతున్నట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం కేత్తి పట్టణ పంచాయతీ పరిధిలోని ఉల్లాడా గ్రామానికి 'ఉత్తమ పర్యాటక గ్రామం' అవార్డు అందజేసి గౌరవించింది. కేత్తి ప్రాంతాన్ని చెత్త రహితంగా తీర్చిదిద్దడానికి అధ్యక్షురాలు హేమమాలిని, ఈవో నటరాజన్ తదితరులు పలు చర్యలు చేపడుతున్నారు. అదేవిధంగా చెత్తలో పడేస్తున్న రబ్బర్ టైర్లు, మరుగుదొడ్డి పింగాణి వ్యర్థాలు తదితరాలకు రంగులు పూసి అందంగా తీర్చిదిద్దుతున్నారు. పూల కుండీలను రూపొందిస్తున్నారు. పార్కులలో నేరేడు, జామ, కివి తదితర మొక్కలను నాటి సంరక్షిస్తున్నారు. ఘన వ్యర్థాల నిర్వహణ ప థకం కింద తడి, పొడి చెత్తను రీసైక్లింగ్ చేసి ఎరువుగా మారుస్తున్నారు. పార్కులలో ప్రజలు సేద తీరడానికి కుర్చీలు, అరుదైన పువ్వుల మొక్కలను నాటి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పిస్తున్నారు.



వళంమీట్టు పార్కు

అధిక ఫీజులు వసూలు చేసే కళాశాలలపై చర్యలు

మంత్రి మా.సుబ్రమణియన్



ఆస్పత్రిలో పరికరాలను పరిశీలిస్తున్న మా.సుబ్రమణియన్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: చెన్నై కీల్పాక్కం వైద్య కళాశాల ఆస్పత్రిలోని బర్న్ యూనిట్‌లో రూ.8.80 కోట్ల వ్యయంతో అధునాతన వైద్య పరికరాలను ఆరోగ్యశాఖ మంత్రి మా.సుబ్రమణియన్ బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... కీల్పాక్కం ఆస్పత్రి దేశంలోనే రెండో పెద్ద బర్న్ యూనిట్ చికిత్సా ఆస్పత్రిగా ఉందన్నారు. ఇక్కడికి రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచేకాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కాలిన గాయాలతో వస్తుంటారని చెప్పారు. రోగుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని చర్మం దానంగా పొంది ఇక్కడి స్కిన్ బ్యాంక్‌లో భద్రపరుస్తున్నట్లు తెలిపారు. రోగులకు మరిన్ని సదుపాయాలు కల్పించేవిధంగా రూ.8.80కోట్ల వ్యయంతో అధునాతన వైద్య పరికరాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కొన్ని కళాశాలలలో విద్యార్థుల నుంచి రూ.3.5 లక్షల వరకు ఫీజులు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, బాధితులెవరైనా ఫిర్యాదు చేస్తే సదరు కళాశాలలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. అక్టోబర్ 14వ తేదీ నుంచి మెడికల్ యూజీ విద్యార్థులకు తరగతులు ప్రారంభమవుతాయని చెప్పారు. 16వ తేదీ నుంచి పారామెడికల్, ఇతర వైద్య కోర్సులకు తరగతులు నిర్వహిస్తారని తెలిపారు.



లీగ్‌లో పాల్గొన్న విద్యార్థులు

ఆకట్టుకున్న రోబోటిక్స్ లీగ్

వడపళని, న్యూస్‌టుడే: తిరుచ్చిలోని నేషనల్ కాలేజీలో జరిగిన 'తమిళనాడు రోబోటిక్స్ లీగ్' (టీఆర్ఎల్-3)లో రాష్ట్రంతో పాటు కేరళ, తెలంగాణలోని 370 పాఠశాలల నుంచి 5 వేల మందికిపైగా విద్యార్థులు పాల్గొన్నారు. 'సైన్స్, టెక్నాలజీ, రోబోటిక్స్' అంశాల్లో విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు విద్యార్థులు తయారు చేసిన వస్తువుల ప్రదర్శన ఏర్పాటైంది. జూనియర్, సీనియర్, సూపర్ సీనియర్ అని మూడు విభాగాలుగా విద్యార్థులు పాల్గొన్నారని నిర్వాహకులు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

టీవీకేతో అన్ని పార్టీలపై ప్రభావం

జీకే వాసన్

ప్యారిస్, న్యూస్‌టుడే: నటుడు విజయ్ పార్టీతో అన్ని రాజకీయ పార్టీలపై ప్రభావం ఉంటుందని టీఎంసీ అధ్యక్షుడు జీకే వాసన్ అన్నారు. మదురైలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... చెన్నైలో జరిగిన ఎయిర్ షోకు ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేయలేదని, ఐదుగురి మృతికి రాష్ట్ర ప్రభుత్వ అజాగ్రత్తే కారణమన్నారు. మృతుల కుటుంబాలకు తలా రూ.25 లక్షల పరిహారం అందజేయాలన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు లోపించాయ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టి మద్యం దుకాణాలను మూసేయాలని సూచించారు. ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో ఈసారి అధికంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని, స్థానిక సంస్థలు తగిన ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. వరుస పండుగలు వస్తున్నందున రేషన్ దుకాణాల్లో నిరంతరాయంగా సరకులు పంపిణీ చేయాలన్నారు.



టీబీఎం 'పాలార్' వద్ద అర్జునన్ తదితరులు

స్టెర్లింగ్ రోడ్డుకు చేరుకున్న టీబీఎం 'పాలార్'

వడపళని, న్యూస్‌టుడే: మెట్రో రెండో దశలో భూగర్భ పనుల కోసం మూడో మార్గంలోని చెట్‌పేట నుంచి స్టెర్లింగు రోడ్డు వరకు టీబీఎం 'పాలార్' తన పనులను విజయవంతంగా పూర్తి చేసింది. 2023 సెప్టెంబరులో చేట్‌పేట్ నుంచి స్టెర్లింగు రోడ్డుకు తవ్వకం పనులు ప్రారంభమయ్యాయి. స్టెర్లింగు రోడ్డుకు ఈ ఏడాది ఆగస్టుకు చేరుకుంది. బుధవారం నాటికి స్టెర్లింగు రోడ్డులో రెండు వైపులా 708 మీటర్ల పొడవుతో పనులు సమర్థవంతంగా నిర్వహించిందని సీఎంఆర్ఎల్ ఓ ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ కార్యదర్శి హర్ సాహే మీనా, సీఎంఆర్ఎల్ ప్రాజెక్ట్స్ డైరెక్టరు టి.అర్జునన్ తదితరులు టీబీఎంను పరిశీలించారు.

రాజధాని కళాశాలలో ఘనంగా జాతీయ సదస్సు





మేడిపల్లి రవికుమార్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు ◆ ప్రసంగిస్తున్న ఆచార్య విస్తాలి శంకరరావు

వడపళని, న్యూస్‌టుడే: 'రంగనాథ రామాయణము - మానవీయ విలువలు' అంశంపై ప్రెసిడెన్సీ కళాశాల (రాజధాని)లో బుధవారం ఒక రోజు జాతీయ సదస్సు ఘనంగా జరిగింది. పత్రి అనురాధ ప్రార్థనా గీతాన్ని ఆలపించారు. కళాశాల తెలుగు శాఖాధ్యక్షులు, సభాధ్యక్షులైన డాక్టర్ ఎలిజబెత్ అంశాన్ని ఎందుకు ఎంచుకున్నారో వివరించారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన డాక్టర్ టీఆర్ఎస్ శర్మ రంగనాథ రామాయణంలోని మానవీయ విలువలు ప్రస్తావించారు. రామరాజ్యం, సోదర ప్రేమల గురించి రంగనాథ రామాయణంలో ఎలా పొందుపరిచారో గౌరవ అతిథిగా విచ్చేసిన ఆచార్య ఎల్బీ శంకరరావు తెలియజేశారు. వేద విజ్ఞాన వేదిక అధ్యక్షుడు జేకే రెడ్డి, ఆచార్య మేడిపల్లి రవికుమార్, డీఆర్బీసీసీసీ కళాశాల తెలుగు శాఖ సహ ఆచార్యులు డాక్టర్ టి.కల్పన, కళాశాల పూర్వ విద్యార్థి, విశ్రాంత ఆచార్యులు విజయలక్ష్మి, డాక్టర్ సీతమ్మ, సర్ త్యాగరాయ కళాశాల ఆచార్యులు డాక్టర్ మునిరత్నం తదితరులు ప్రసంగించారు. ముఖ్య అతిథులుగా ప్రముఖ న్యాయవాది అద్దెపల్లి పురుషోత్తం, విశ్రాంత జిల్లా విద్యాధికారి (పొన్నేరి) గంగాధర రెడ్డి, కళాశాల పూర్వ ఆచార్యులు అనిందిత, మద్రాసు విశ్వవిద్యాలయం ఆచార్యులు విస్తాలి శంకరరావు పాల్గొన్నారు. అతిథులు, కళాశాల పూర్వ విద్యార్థులను ఎల్బీ శంకరరావు సత్కరించారు.

ప్రైవేటు పాఠశాలల్లో వసతులకు తగ్గట్టు ఫీజులుండాలి

ప్యారిస్, న్యూస్‌టుడే: ప్రైవేటు పాఠశాలల్లో వసతులకు తగ్గట్టు ఫీజులు వసూలు చేస్తున్నారా? అనేదానిని సరిచూసేందుకు ప్రైవేటు పాఠశాలల ఫీజుల నిర్ధారణ కమిటీపై ఎలాంటి నిషేధం లేదని మద్రాసు హైకోర్టు స్పష్టం చేసింది. చెన్నైలోని ఓ ప్రైవేటు హైస్కూల్‌లో చదువుతున్న విద్యార్థిని 2018-19, 2020-21 వరకు చెల్లించని రుసుము రూ.76,275ని 12 శాతం వడ్డీతో చెల్లించాలని ఆమె తల్లిదండ్రులను ఆదేశించాలని కోరుతూ పాఠశాల యాజమాన్యం తరపున సివిల్ కోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు.. పాఠశాల యాజమాన్యం అందించే వసతులకు తగ్గట్టుగా ఫీజు వసూలు చేస్తున్నారా? అనే విషయమై పరిశీలించి నివేదిక దాఖలు చేయాలని తమిళనాడు ప్రైవేటు పాఠశాలల ఫీజు నిర్ధారణ కమిటీకి ఉత్తర్వులు ఇచ్చింది. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ ప్రైవేటు పాఠశాల యాజమాన్యం తరఫున మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌పై మంగళవారం విచారణ జరిపిన జస్టిస్ లక్ష్మీనారాయణన్.. పాఠశాలలో వసతులకు తగ్గట్టుగా ఫీజు వసూలు చేస్తున్నారో? లేదో? సరిచూసేందుకు ఫీజుల నిర్ధారణ కమిటీకి ఎలాంటి నిషేధం లేదని స్పష్టం చేసింది. విద్యార్థిని తండ్రి తరపున రూ.50 వేలు ఫీజుని అక్టోబరు 18లోగా చెల్లిస్తారని తెలపడంతో న్యాయమూర్తి అంగీకరించారు.

విద్యుత్ బిల్లుల చెల్లింపు విధానంలో మార్పులు

సైదాపేట, న్యూస్‌టుడే: విద్యుత్ బిల్లుల చెల్లింపు విధానంలో విద్యుత్ బోర్డు మార్పులు చేసింది. ఆ మేరకు రూ.5 వేలకు పైగా బిల్లు చెల్లించాల్సి వస్తే కౌంటర్‌లో చెల్లించడం కుదరదని సమాచారం. దేశవ్యాప్తంగా డిజిటల్ లావాదేవీలు పెరుగుతున్నా ఇప్పటికీ కౌంటర్లలో విద్యుత్ బిల్లులు చెల్లించేవారు లేకపోలేదు. ఈ నేపథ్యంలో ఇకపై రూ.5 వేల కంటే ఎక్కువ బిల్లు కట్టాల్సి వస్తే చెక్, డీడీ ద్వారా మాత్రమే చెల్లించాలని తెలిపింది. అదే సమయంలో ఆన్‌లైన్‌లో బిల్లు చెల్లించేందుకు ఎలాంటి అభ్యంతరం లేదని పేర్కొంది. అదనపు ఛార్జీలు కూడా బ్యాంకులు వసూలు చేయవని తెలిపింది. రానున్న రోజుల్లో ప్రత్యక్ష చెల్లింపులను క్రమేపీ తగ్గించనున్నట్లు వివరించింది. రూ.1000, అంతకంటే ఎక్కువ విద్యుత్ రుసుములను ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలని సూచించింది.

అంతర్జాతీయ స్థాయికి భారతీయ హోమియోపతి



విజయోత్సవాలపై వివరాలు వెల్లడిస్తున్న జయకుమార్, కొల్లిరాజు తదితరులు

టీనగర్, న్యూస్‌టుడే: హోమియోపతి, ఆయుష్ వైద్య విధానాలను కేంద్ర ఆయుష్ మంత్రిత్వశాఖ ప్రపంచ స్థాయిలో ముందుకు తీసుకెళ్తున్నట్లు తమిళనాడు హోమియోపతి మెడికల్ కౌన్సిల్ నిర్వాహకులు తెలిపారు. కేంద్ర ఆయుష్ మంత్రిత్వశాఖ వంద రోజుల విజయోత్సవాలు జరుపుకుంటున్న నేపథ్యంలో తమిళనాడులో హోమియోపతి వైద్య విధానంలో జరుపుకుంటున్న ఉచిత వైద్యశిబిరాలు తదితర కార్యక్రమాలపై చెన్నైలోని దివ్యాంగుల ఆరోగ్య పరిశోధన కేంద్రం సలహాదారు డా.కొల్లిరాజు బుధవారం వివరించారు. పరిశోధన కేంద్రంలో ఉచిత వైద్య శిబిరాలు జరుగుతున్న నేపథ్యంలో దివ్యాంగులు పాల్గొని లబ్ధిపొందాలని పిలుపునిచ్చారు. కేంద్రం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు సుమారు 14 వేల మందికి పైగా పాల్గొన్నారని గుర్తుచేశారు. తమిళనాడు రాష్ట్ర హోమియోపతి సంఘం అధ్యక్షులు డాక్టర్ ఎన్ఆర్.జయకుమార్ మాట్లాడుతూ.. కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ ద్వారా గత వంద రోజులలో సాధించిన లక్ష్యాలు, అందించిన సేవలను వివరించారు. నగరంలో హోమియోపతి వైద్య కేంద్రాన్ని 25 పడకలతో కూడిన వైద్యశాలగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వ అనుమతి కోరామన్నారు. అందుకు తగిన భూములను గుర్తిస్తే నిధులు కేటాయించే విషయమై పరిశీలించనున్నట్లు కేంద్రం హామీ ఇచ్చిందని తెలిపారు. చెన్నైలోని దివ్యాంగుల ఆరోగ్య పరిశోధన కేంద్రం ఇన్‌ఛార్జి కార్తికేయన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన హోమియోపతి వైద్య కళాశాల విద్యార్థులకు తమ కేంద్రంలో నెల రోజుల పాటు వైద్య శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు.

తిరుచ్చెందూర్ ఆలయ పునరుద్ధరణ పనులు వచ్చే జూన్‌కు పూర్తి

మంత్రి శేఖర్‌బాబు

ప్యారిస్, న్యూస్‌టుడే: తిరుచ్చెందూర్ సుబ్రహ్మణ్యస్వామి ఆలయ పునరుద్ధరణ పనులు 2025 జూన్ నాటికి పూర్తవుతాయని మంత్రి శేఖర్‌బాబు తెలిపారు. తిరుచ్చెందూర్ ఆలయంలో రూ.48.36 కోట్లతో నిర్మిస్తున్న భక్తుల వసతి గృహాల నిర్మాణ పనులు, ఆలయ పునరుద్ధరణ పనులను బుధవారం మంత్రి పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ... ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతూనే ఉందన్నారు. వారికి కనీస సౌకర్యాలు కల్పించడంతో పాటు ఎక్కువ సమయం వేచి ఉండకుండా త్వరగా దర్శనం కలిగేలా అవసరమైన పనులు చేపట్టాలని ముఖ్యమంత్రి ఉత్తర్వులు ఇచ్చారన్నారు. ఆలయ ప్రాంగణంలో నిర్మించిన భక్తుల వసతి గృహాన్ని 14వ తేదీ ముఖ్యమంత్రి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభిస్తారని చెప్పారు. అదేవిధంగా ఆలయ పునరుద్ధరణ పనులు 2025 జూన్ నాటికి పూర్తి చేసి, కుంభాభిషేకం నిర్వహించడానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఆయనతో పాటు దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి చంద్రమోహన్, శాఖ కమిషనరు శ్రీధర్, జిల్లా కలెక్టరు ఇళంభగవత్ తదితరులు ఉన్నారు.

కొడైకెనాల్‌లో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు



రోడ్ నిర్మాణ మ్యాప్ పరిశీలిస్తున్న మంత్రి ఈవీ వేలు తదితరులు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: దిండుక్కల్ జిల్లాలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన కొడైకెనాల్‌కు రాష్ట్రనలుమూలల నుంచేకాకుండా పలు రాష్ట్రాల నుంచి అధికంగా పర్యాటకులు వస్తుంటారు. దీంతో కొడైకెనాల్‌లో తీవ్ర ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. పర్యాటకులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో రహదారులశాఖ మంత్రి ఈవీ వేలు, మంత్రులు చక్రపాణి, సామినాథన్ అధికారులతో కలిసి బుధవారం కొడైకెనాల్ రహదారులను పరిశీలించారు. ప్రధాన ప్రాంతాలను కలిపే విధంగా మరో ప్రత్యామ్నాయ రహదారి నిర్మించేందుకు స్థల పరిశీలన జరిపారు. అనంతరం మంత్రి ఈవీ వేలు విలేకరులతో మాట్లాడుతూ.. సర్వేలు నిర్వహించి సవివరమైన ప్రాజెక్టు నివేదికను సిద్ధం చేస్తామని, ప్రత్యామ్నాయ రహదారిని త్వరగా నిర్మిస్తామని తెలిపారు. రాష్ట్రంలోని పలు కొండ మార్గాల్లో సాయిల్ నెయిలింగ్ అనే కొత్త సాంకేతికతతో కొండ చరియలు విరిగిపడకుండా చేస్తున్నట్లు పేర్కొన్నారు. హైవేలపై ఉన్న స్థలాల్లో ఆక్రమణలను పూర్తిగా తొలగించి, ఆస్తులు కాపాడకుంటే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అధికారంలో భాగస్వామ్యం న్యాయమే : హెచ్.రాజా

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: అధికారంలో తిరుమావళవన్ భాగస్వామ్యం అడగడం న్యాయమేనని భాజపా సీనియర్ నాయకులు హెచ్.రాజా పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్వహణ లోపంతోనే మెరినా ఎయిర్‌షోలో అపశ్రుతి చోటుచేసుకుందన్నారు. ప్రజలకు తాగునీరు కూడా ఇవ్వలేకపోయిందని ఆరోపించారు. తన స్నేహితుల సంక్షేమం కోసం క్రీడాశాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఉదయనిధి కార్ రేస్ నిర్వహించేందుకు ఏర్పాట్లు దగ్గరుండి చేశారని విమర్శించారు. ఉపముఖ్యమంత్రి అయిన తర్వాత తన విధులను మరచిపోయారని ఎద్దేవా చేశారు. గంజాయి తప్ప వేరే ఏ ఇతర మత్తుపదార్థాలను రాష్ట్ర పోలీసులు పట్టుకున్నట్లు తెలియడం లేదన్నారు. అన్ని విధాలుగా డీఎంకే ప్రభుత్వం విఫలమైందన్నారు. కూటమి కోసమే పార్టీలు అవసరమని, అధికారంలో భాగస్వామ్యం అడగకూడదనేది డీఎంకే సిద్ధాంతమన్నారు.



సిబ్బందికి అభివాదం చేస్తున్న పీవీఎస్ నారాయణ

రాష్ట్రంలో ఎయిర్ వైస్ మార్షల్ పర్యటన

వడపళని, న్యూస్‌టుడే: న్యూదిల్లీలోని నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ) అడిషనల్ డైరెక్టర్ జనరల్, ఎయిర్ వైస్ మార్షల్ పీవీఎస్ నారాయణ ఎన్‌సీసీ డైరెక్టరేట్ తమిళనాడు, పుదుచ్చేరి, అండమాన్ నికోబార్ హెడ్‌క్వార్టర్సు కార్యాలయాన్ని బుధవారం పరిశీలించారు. ఎన్‌సీసీ క్యాడెట్లకు అందిస్తున్న శిక్షణ, పరిపాలనాపరంగా ఉన్న సమస్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎన్‌సీసీ-1 టీఎన్ నావల్ యూనిట్, ఎన్‌సీసీ-1 టీఎన్ బెటాలియన్ యూనిట్‌ను కూడా ఆయన సందర్శించారు.



లబ్ధిదారులకు పట్టాలు అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి

ఇళ్ల స్థలాలకు పట్టాల పంపిణీ

సైదాపేట, న్యూస్‌టుడే: చెన్నై జిల్లాలో లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల ఉత్తర్వుపత్రాల అందజేత కార్యక్రమాన్ని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ బుధవారం ప్రారంభించారు. ఆవడిలో జరిగిన కార్యక్రమంలో మంత్రులు రామచంద్రన్, నాజర్, పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉదయనిధి స్టాలిన్ మాట్లాడుతూ... చెన్నై, శివారు ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు పొందటంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రత్యేక చర్యలు తీసుకుని 35,603 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పట్టాలు అందించినట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు డీఎంకే ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పాటుపడాలని పిలుపునిచ్చారు.

కన్నియాకుమరికి ప్రత్యేక రైళ్లు

వడపళని, న్యూస్‌టుడే: ప్రయాణికుల రద్దీ కారణంగా కన్నియాకుమరి, కొట్టయంకు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్టు దక్షిణ రైల్వే బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది.

06193 ఎగ్మూరులో 10, 12 తేదీలు 23.45కు బయలుదేరి మరుసటి రోజు 12.20కి కన్నియాకుమరి చేరుతుంది. **06194** కన్నియాకుమరిలో 11, 13 తేదీలు 14.45కు బయలుదేరి మరుసటి రోజు 03.15కి ఎగ్మూరు వస్తుంది. **06195** చెన్నై సెంట్రల్‌లో 10, 12 తేదీలు 23.55కు బయలుదేరి మరుసటి రోజు 13.45 కొట్టయం వెళ్తుంది. **06196** కొట్టయంలో 11, 13 తేదీలు 16.45కు బయలుదేరి మరుసటి రోజు 08.20కి చెన్నై సెంట్రల్ వస్తుంది. రిజర్వేషన్లు కూడా అందుబాటులో ఉన్నాయి.



సరస్వతీదేవి అలంకరణలో కన్యకా పరమేశ్వరి, శ్రీకొళ్లాపురమ్మ

సరస్వతి అవతారంలో కన్యకా పరమేశ్వరి

పళ్లిపట్టు, న్యూస్‌టుడే: పళ్లిపట్టు బజారు వీధిలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శరన్నవరాత్రుల సందర్భంగా బుధవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, దీపారాధనలు జరిగాయి. సాయంత్రం అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించారు. అదేవిధంగా పళ్లిపట్టు పట్టణ దేవత శ్రీకొళ్లాపురమ్మ ఆలయంలో ఉదయం ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, దీపారాధనలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

ఘనంగా కన్యపూజ



కన్య పూజలో పాల్గొన్న చిన్నారులు

కాంచీపురం, న్యూస్‌టుడే: కాంచీపురం ఆర్య వైశ్య సమాజంలో నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం రాత్రి కన్యకా పరమేశ్వరి అమ్మవారిని మహాలక్ష్మిగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కలిగించారు. అనంతరం 21 మంది చిన్నారులతో కన్య పూజను వైభవంగా నిర్వహించారు. మహిళా భక్తులకు ప్రసాదాలు, పసుపుకుంకుమ అందజేశారు.



మహాలక్ష్మి అలంకరణలో కన్యకాపరమేశ్వరి

'ఈశా'లో నవరాత్రి వేడుకలు

వడవళ్లి, న్యూస్‌టుడే: కోయంబత్తూరు జిల్లా ఈశా యోగా కేంద్రంలో దసరా నవరాత్రి వేడుకలు 3వ తేదీ నుంచి ప్రారంభమయ్యాయి. 6వ తేదీ తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన ఆదివాసీ కళాకర బృందం ప్రదర్శించిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుందని బుధవారం ఈశా కేంద్రం ఓ ప్రకటనలో పేర్కొంది. ఏటా కేంద్రంలో తొమ్మిది రోజులపాటు నవరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహిస్తారు, ఇందులో భాగంగా దేవీ లింగభైరవికి అభిషేకాలు జరుగుతాయని తెలిపింది. మొదటి మూడు రోజులు అమ్మవారికి కుంకుమాభిషేకం, తర్వాత పసుపుతో అభిషేకం, చివరి మూడు రోజులు చందన అభిషేకం చేస్తారు. దసరా సందర్భంగా ప్రతి రోజూ రాత్రి 10.20 గంటల వరకు ఆలయాన్ని తెరచి ఉంచుతారు. అదేవిధంగా నిత్యం మహా హారతి ఇస్తారు.



కళాకారుల నృత్య ప్రదర్శన

గ్రూప్‌-4 పోస్టుల పెంపు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: పలు ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న జూనియర్ అసిస్టెంట్, టైపిస్ట్, ల్యాబ్ అసిస్టెంట్, షార్ట్‌హ్యాండ్ టైపిస్ట్, ఇంటర్వ్యూ అసిస్టెంట్ సహా 23 రకాల 6,244 గ్రూప్‌-4 పోస్టుల భర్తీకి టీఎన్‌పీఎస్సీ జూన్ 9న పరీక్ష నిర్వహించింది. 15.88 లక్షల మంది రాశారు. సెప్టెంబర్ 11న అదనంగా 480 పోస్టులను జత చేసింది. ఈ క్రమంలో మరిన్ని పోస్టులను భర్తీ చేయాలని అభ్యర్థులు, రాజకీయ పార్టీలనుంచి డిమాండ్లు రావడంతో పలు శాఖలో ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలను సేకరించింది. ఈ నెలలో పరీక్ష ఫలితాలు విడుదలవుతాయని అనుకున్న నేపథ్యంలో అదనంగా 2,208 పోస్టులను కలిపినట్లు టీఎన్‌పీఎస్సీ బుధవారం ప్రకటించింది. దీంతో మొత్తం ఖాళీల సంఖ్య 8,932కు పెరిగింది. ఇందుకు సంబంధించి వివరాలను టీఎన్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చు.



సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి సెంథిల్‌బాలాజీ

ఇంధనశాఖ ప్రకటనలపై సమీక్ష

సైదాపేట, న్యూస్‌టుడే: అసెంబ్లీలో ఇంధనశాఖ తరఫున చేసిన ప్రకటనలపై తీసుకున్న చర్యలకు సంబంధించి సమీక్ష బుధవారం మంత్రి సెంథిల్‌బాలాజీ నేతృత్వంలో విద్యుత్ బోర్డు ప్రధాన కార్యాలయంలో జరిగింది. ఇందులో తమిళనాడు విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ సంస్థ అధ్యక్షుడు, ఎండీ నందకుమార్, తమిళనాడు గ్రీన్ ఎనర్జీ సంస్థ ఎండీ అనీష్ శేఖర్, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంధనశాఖపై అసెంబ్లీలో చేసిన ప్రకటనలు, వాటి ప్రస్తుత స్థితి గురించి, ఈ ఏడాది లోగా ముగించాల్సిన పనుల పురోగతిపై సమీక్షించారు.



రోడ్డుపై పడిన భారీ బండరాయి

కొడైక్కానల్ కొండ మార్గంలో జారిపడిన బండరాళ్లు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: ప్రముఖ పర్యాటక కేంద్రమైన కొడైక్కానల్‌లో మంగళవారం భారీ వర్షం కురిసింది. ఈ క్రమంలో అడుక్కం-కుంబక్కరై కొండ మార్గంలో కొండ చరియలు జారిపడ్డాయి. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. రహదారుల శాఖాధికారులు, సిబ్బంది ఘటనా స్థలికి చేరుకొని చరియలు, రాళ్లు, మట్టిని తొలగించడంతో రాకపోకలు ప్రారంభమయ్యాయి.

సేలం, కున్నూర్‌లో కుండపోత వర్షం

విలివాక్కం, న్యూస్‌టుడే: నీలగిరి జిల్లా కున్నూర్, దాని పరిసర ప్రాంతాలలో గత కొన్ని రోజులుగా మేఘావృతమై ఉంటోంది. మంగళవారం సాయంత్రం భారీవర్షం కురిసింది. ముఖ్యంగా కున్నూర్, వెల్లింగ్టన్, అరువంగాడు, ఎల్లనల్లి, కున్నకంబై, తూతూర్, మట్టం, కొలక్కంబై, ఎడపల్లి తదితర ప్రాంతాలలో వాన ముంచెత్తింది. కున్నూర్-మేట్టుపాళ్యం మార్గంలో బర్లియార్ ప్రాంతంలో కురిసిన వర్షానికి దుకాణాల్లోకి నీరు చేరింది. బర్లియార్ గిరిజన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోకి నీరు చేరింది. సేలం జిల్లాలోని సేలం నగరం, ఏర్కాడ్, వాళప్పాడి, ఆత్తూరు, కెంగవల్లి, కరియకోవిల్, ఓమలూర్ సహా పలు ప్రాంతాలలో బుధవారం భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పర్యాటక ప్రాంతమైన ఏర్కాడ్‌లో 6 మి.మీ వర్షం కురిసింది. అయోధ్యపట్టణం, పరిసర ప్రాంతాలలో పొగమంచు కమ్ముకుంది.



బర్లియార్ పాఠశాల తరగతి గదిలోకి చేరిన నీరు

వర్షాలను ఎదుర్కొనేందుకు సిద్ధం

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: ఈశాన్య రుతుపవనాల వర్షాలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర మంత్రి కేఎన్ నెహ్రూ తెలిపారు. పుదుకోట్టై మున్సిపాలిటీ కార్పొరేషన్‌గా స్థాయి పెరిగిన తర్వాత మొదటి కౌన్సిల్ సమావేశం బుధవారం జరిగింది. జిల్లా కలెక్టర్ అరుణ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో మంత్రులు కేఎన్ నెహ్రూ, రఘుపతి పాల్గొని కార్పొరేషన్ కార్యకలాపాలను ప్రారంభించారు. మేయర్ తిలకవతికి సెంగోల్‌ని అందించారు.



మేయర్ తిలకవతికి సెంగోల్ అందిస్తున్న మంత్రులు కేఎన్ నెహ్రూ, రఘుపతి

బస్టాండ్ నిర్మాణ పనులు, ఏడు వార్డుల్లో మురుగునీటి పారుదల ప్రాజెక్ట్, ఐదు వార్డుల్లో తాగునీటి సరఫరా పనులు తదితర రూ.145.55కోట్ల విలువైన కొత్త ప్రాజెక్ట్‌లకు మంత్రి కేఎన్ నెహ్రూ శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... రాష్ట్రంలోని అన్ని నగర ప్రాంతాల్లోని కాలువల్లో పూడికతీసినట్లు తెలిపారు. వరదబాధిత ప్రాంతాల్లోనివారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అవసరమైన యంత్రాలు, పరికరాలు సిద్ధంగా ఉంచామన్నారు. మున్సిపల్‌శాఖలో త్వరలో 2,600 పోస్టులను భర్తీ చేస్తామన్నారు.



రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమశాఖ మంత్రి ఎంఆర్‌కే పన్నీర్ సెల్వం నేతృత్వంలో బుధవారం సచివాలయంలో శాఖ అభివృద్ధి పనులపై సమీక్ష జరిగింది. శాఖ ముఖ్య కార్యదర్శి అపూర్వ, ఉన్నతాధికారులు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. – టీనగర్, న్యూస్‌టుడే

ఆర్‌ఎస్‌ఎస్ ర్యాలీలో పాల్గొనడంతోనే తళవాయ్ సుందరంపై వేటు

ప్యారిస్, న్యూస్‌టుడే: ఆర్‌ఎస్‌ఎస్ కార్యక్రమాల్లో పాల్గొనడంతోనే అన్నాడీఎంకే నుంచి ఎమ్మెల్యే తళవాయ్ సుందరాన్ని తొలగించినట్లు సమాచారం. కన్నియాకుమరి శాసనసభ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఉన్న తళవాయ్ సుందరం కన్నియాకుమరి తూర్పు జిల్లా అన్నాడీఎంకే కార్యదర్శిగా, పార్టీ రాష్ట్ర సంస్థాగత కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొంటున్న ఆయన్ను ఉన్నట్టుండి పార్టీ నుంచి తొలగించడం తీవ్ర చర్చకు దారితీసింది. ఈ నేపథ్యంలో కన్నియాకుమరి శాసనసభ నియోజకవర్గం ప్రాంతంలో ఈ నెల 6న జరిగిన ఆర్‌ఎస్‌ఎస్ ర్యాలీని తళవాయ్ సుందరం ప్రారంభించినట్లు పార్టీ అధిష్ఠానానికి తెలిసింది. అంతేకాకుండా వివేకానంద మండపంలో జరిగిన ఆర్‌ఎస్‌ఎస్ కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన ప్రసంగించారు. ఆర్‌ఎస్‌ఎస్ అఖిల భారత అధ్యక్షుడిని కలిసి మాట్లాడారు. ఈ కారణాలతో ఆయన్ను పార్టీ నుంచి తొలగించినట్లు తెలుస్తోంది. అదేవిధంగా గత కొన్ని నెలలుగా కన్నియాకుమరి తూర్పు జిల్లాలో అన్నాడీఎంకే నేతలు రెండు వర్గాలుగా చీలి పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయమై అధిష్ఠానానికి ఫిర్యాదు అందడంతో ఆయన్ను పార్టీలోని అన్ని బాధ్యతల నుంచి తొలగించారు. దీని గురించి తళవాయ్ సుందరం మాట్లాడుతూ.. ఏదీ జరిగిన ఒప్పు అనే చెప్పాలన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ కార్యక్రమంలో పాల్గొనడంతో పార్టీ బలం తగ్గిందని అధిష్ఠానం భావించి ఉండవచ్చన్నారు.

వర్షాకాల సన్నద్ధతపై సమాలోచన

చెన్నై, న్యూస్‌టుడే: ఈశాన్య రుతుపవనాల వర్షాల సన్నద్ధతపై ప్రజలు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులతో ఆరోగ్యశాఖ మంత్రి సుబ్రమణియన్ సమావేశం నిర్వహించారు. అడయారు జోన్ వేళచ్చేరిలోని రాజలక్ష్మీ కల్యాణమండపంలో బుధవారం జరిగిన సమావేశంలో వర్షాలను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి చేపట్టిన సన్నాహాలు, అధికారులకు ప్రజలు అందించాల్సిన సహకారం గురించి మంత్రి సుబ్రమణియన్ మాట్లాడారు. సమావేశంలో నివాసుల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, వాలంటీర్లు, వేళచ్చేరి ఎమ్మెల్యే జే.ఎం. హెచ్. హసన్ మౌలానా, డిప్యూటీ మేయర్ మహేశ్‌కుమార్, అడయారు జోనల్ కమిటీ ఛైర్మన్ దురైరాజ్, జోనల్ అధికారి శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి మా సుబ్రమణియన్

చిదంబరం నటరాజస్వామి ఆలయ పూజారులపై కేసు

టీనగర్, న్యూస్‌టుడే: చిదంబరం నటరాజస్వామి ఆలయంలో భక్తుడిపై దాడి చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న పూజారులపై పోలీసులు కేసు నమోదు చేశారు. చిదంబరంలోని వల్లంపడుగై ప్రాంతానికి చెందిన ఇళయరాజా అనే వ్యక్తి ఇటీవల ఆలయంలోకి వెళ్లారు. ఆలయ పూజారులు కొందరు ఆలయ ప్రహరీ లోపల క్రికెట్ ఆడుతుండగా తన సెల్‌ఫోన్‌లో వీడియో చిత్రీకరించారు. గమనించిన పూజారులు సెల్‌ఫోన్ లాక్కుని అతనిపై దాడి చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. అదే సమయంలో మంగళవారం ఇళయరాజాకు మద్దతుగా వీసీకే కార్యకర్తలు పోలీసు స్టేషన్‌కు చేరుకుని ఆందోళన చేశారు. దీంతో పోలీసులు ఆలయ పూజారులు ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



చెన్నై కురళగంలో పాడిపరిశ్రమ, ఖాదీశాఖ మంత్రి ఆర్‌ఎస్ రాజకణ్ణప్పన్ నేతృత్వంలో మంగళవారం తమిళనాడు ఖాదీ గ్రామీణ బోర్డు అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. ఇందులో శాఖ కార్యదర్శి అముదవల్లి, ఖాదీ గ్రామీణ వృత్తుల బోర్డు సీఈవో మహేశ్వరి, శాఖాధికారులు పాల్గొన్నారు. – విలివాక్కం, న్యూస్‌టుడే



సినీ నటుడు జయరామ్ దంపతులు బుధవారం ముఖ్యమంత్రి స్టాలిన్‌ను సచివాలయంలో కలిసి తమ కుమారుడు కాళిదాస్ జయరామ్ వివాహానికి ఆహ్వానిస్తూ శుభలేఖ అందించారు. వెంట ముఖ్యమంత్రి సతీమణి దుర్గా స్టాలిన్ ఉన్నారు.



మురసొలి దినపత్రిక ఆడిటర్ శివసుబ్రమణియన్ తల్లి గోమతి మరణించిన నేపథ్యంలో వెస్ట్ మాంబలంలోని నివాసం వద్ద ఉంచిన ఆమె భౌతికకాయానికి ముఖ్యమంత్రి స్టాలిన్ బుధవారం నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. వెంట ఎమ్మెల్యేలు వేలు, కరుణానిధి, మురసొలి ఎడిటర్ సేతు, జనరల్ మేనేజర్ రాజశేఖరన్ తదితరులు ఉన్నారు.



అమెరికా కేంద్రంగా కొనసాగుతున్న ఈటన్ సంస్థ సీఈవో క్రైగ్ అర్నాల్డ్ బుధవారం సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిశారు. ఈ సందర్భంగా పరిశ్రమలశాఖ మంత్రి టీఆర్‌బీ రాజా, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి మురుగానందం, గైడెన్స్ ఎండీ విష్ణు, ఈటన్ సంస్థ ప్రతినిధులు పలువురు ఉన్నారు. – చెన్నై, న్యూస్‌టుడే

25 లోఫ్లోర్ బస్సు సేవలు ప్రారంభం

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: చెన్నైలో ఎంటీసీకి 352 లోఫ్లోర్ బస్సులు కేటాయించారు. వీటిని పలు విడతలుగా ప్రారంభించనున్నారు. ఇప్పటివరకు రూ.170.60 కోట్ల విలువైన 188 బస్సులు అందించిన నేపథ్యంలో జర్మన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ నిధులతో రూ.22.69కోట్లతో మరో 25 బస్సులను కొనుగోలు చేశారు. వీటిని బుధవారం చెన్నై పల్లవన్‌సాలైలో రవాణాశాఖ మంత్రి శివశంకర్ ప్రారంభించారు. అనంతరం ఆయన బస్సులో కాస్త దూరం ప్రయాణించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంటీసీ ఎండీ ఆల్ఫి జాన్‌వర్గీస్ మాట్లాడుతూ... వాతావరణానికి అనుకూలంగా బస్సులను నడపడానికి జర్మన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ నిధులతో సుమారు రూ.7,492 కోట్లతో ఈ ప్రాజెక్ట్‌ను 5 దశల్లో అమలుచేసినట్లు తెలిపారు. ఇందులో రవాణా సంస్థలకు 2,213 బీఎస్ 6 డీజిల్ బస్సులు, 500 ఎలక్ట్రికల్ బస్సులు, 552 లోఫ్లోర్ బస్సులు కొనుగోలు చేస్తున్నారని పేర్కొన్నారు. బస్సుల కొనుగోలుతోపాటు సమాచార సాంకేతికత కోసం ఆధునిక సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేయడం, ఆధునిక పద్ధతులు నేర్చుకోవడానికి డ్రైవర్లకు శిక్షణ ఇవ్వడం ప్రాజెక్ట్‌లో భాగమన్నారు.



కాంచీపురం తాలూకా మేల్‌ఒట్టివాక్కం గ్రామంలో బుధవారం నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమంలో లబ్ధిదారులకు సంక్షేమ సాయం అందజేస్తున్న కలెక్టరు కలైసెల్వి. చిత్రంలో ఎంపీ జి.సెల్వం, ఎమ్మెల్యే ఎళిలరసన్, డీఆర్వో వెంకటేష్ తదితరులున్నారు. – కాంచీపురం, న్యూస్‌టుడే

సంక్షేమ సాయం పంపిణీ

అరక్కోణం, న్యూస్‌టుడే: రాణిపేట జిల్లా ఆర్కాడు తాలూకా పుదుపాడి గ్రామంలో జిల్లా కలెక్టరు చంద్రకళ నేతృత్వంలో బుధవారం ప్రజావేదిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా 298 మంది నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. లబ్ధిదారులకు రూ.66.40 లక్షల విలువైన సంక్షేమ సాయం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్కాడు ఎమ్మెల్యే జేఎల్ ఈశ్వరప్పన్, డీఆర్వో సురేష్, ఆర్డీవో రాజరాజన్, పలువురు అధికారులు పాల్గొన్నారు.



ఓ మహిళకు కుట్టుయంత్రం అందజేస్తున్న కలెక్టరు చంద్రకళ



రాణిపేట జిల్లా ఆర్కాడు యూనియన్ పుదుపాడి గ్రామంలో జిల్లా ప్రజాసంబంధాల శాఖ తరఫున ప్రభుత్వ పథకాలు, సాధించిన విజయాలను వివరించేలా బుధవారం ఫొటో ప్రదర్శన ఏర్పాటు చేశారు. – అరక్కోణం, న్యూస్‌టుడే



ప్రమాదానికి గురైన కారు

కారు, వ్యాన్ ఢీ.. నలుగురి దుర్మరణం

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: కారు, వ్యాన్ ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృత్యువాతపడ్డారు. పోలీసుల కథనం మేరకు... దిండుక్కల్ జిల్లా పళని ఇందిరానగర్‌కు చెందిన త్యాగరాజన్ (45) పాత కార్లు విక్రయిస్తుంటాడు. కోవై జిల్లా కినత్తుకడవు ప్రాంతంలో బంధువు అంత్యక్రియల్లో పాల్గొనేందుకు కుటుంబంతోపాటు త్యాగరాజన్ కారులో వెళ్లారు. తిరిగి బుధవారం తెల్లవారుజామున పళనికి బయలుదేరారు. మడత్తుకుళం ప్రాంతంలో వస్తుండగా పళని ఆలయం నుంచి కేరళకు చెందిన 23 మంది భక్తులతో వస్తున్న ఓ వ్యాన్ ఎదురుగా ఢీకొంది. ప్రమాదంలో కారులో ఉన్న త్యాగరాజన్, అతని భార్య ప్రీతి (40), కుమారుడు జయప్రియన్ (11) అక్కడికక్కడే మృతి చెందారు. త్యాగరాజన్ తల్లి మనోన్మణి (65) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. వ్యాన్‌లో ఉన్న 12మందికి స్వల్పగాయాలయ్యాయి. వారిని స్థానికులు ఉడుమలై ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ నగలను కుదువపెట్టి మోసానికి పాల్పడిన ఆరుగురి అరెస్టు

తిరుత్తణి, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, చిత్తూరు జిల్లా విజయపురం మండలం మల్లారెడ్డి కండ్రిగకు చెందిన వెంకటయ్య, లత (48) భార్యాభర్తలు. లత.. కనకమ్మసత్రంలో రేఖ అనే మహిళకు చెందిన నగల కుదువ దుకాణంలో గత నెల 22వ తేదీ 29 గ్రాముల బంగారు నగలను కుదువపెట్టి రూ.1.25 లక్షలు తీసుకుంది. మూడు రోజుల క్రితం అదే కుదువ దుకాణంలో 20 గ్రాముల నగలు కుదువపెట్టి రూ.90 వేలు తీసుకుంది. అనుమానంతో దుకాణ యజమాని ఆ నగలను పరీక్షించగా నకిలీవని తెలిసింది. దీంతో కనకమ్మసత్రం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి లతను అరెస్టు చేశారు. దర్యాప్తులో పలు కీలక విషయాలు తెలియడంతో పూర్తిస్థాయి దర్యాప్తునకు తిరుత్తణి డీఎస్పీ శ్రీనివాస పెరుమాళ్ ఆదేశించారు. ప్రత్యేక పోలీసు బృందం అన్నమయ్య జిల్లా మదనపల్లెకి చెందిన రామాంజనేయులు (50), పుత్తూరుకు చెందిన చంద్రశేఖర్ (39)ను అదుపులోకి తీసుకొని దర్యాప్తు జరిపింది. వారిద్దరూ గ్రామీణ ప్రాంతాల్లో వాయిదాల పద్ధతిలో గృహోపయోగ వస్తువులు, గోల్డ్ కవరింగ్ నగలను విక్రయించి మహిళలతో పరిచయాలను పెంచుకున్నారని, డబ్బు ఆశచూపి వారి ద్వారా నకిలీ నగలను ఆంధ్రప్రదేశ్, తమిళనాడులోని పలు కుదువ దుకాణాల్లో, ప్రైవేటు బ్యాంకుల్లో కుదువపెట్టి కోట్లాది రూపాయలు తీసుకుని మోసానికి పాల్పడినట్లు తెలిసింది. ఇలా మోసానికి పాల్పడిన రేణిగుంటకు చెందిన హరిత (34), తిరుత్తణి సమీప వీకేఎన్ కండిగైకు చెందిన రేఖ (35)ను అరెస్టు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.



అరెస్టయిన నిందితులు



జెండా ఊపి బస్సులను ప్రారంభిస్తున్న మంత్రి శివశంకర్

మనస్తాపంతో యువతి ఆత్మహత్య

సేలం, న్యూస్‌టుడే: సేలం జిల్లా బోడినాయకనూర్‌కు చెందిన పునిత (19) 2022-23 సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలో ప్లస్‌టూ చదివింది. వైద్య విద్య చదివేందుకు నీట్ రాసి 320 మార్కులు సాధించింది. సీటు రాకపోవడంతో మానసిన ఆవేదనకు గురైంది. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కేసు దర్యాప్తులో ఉంది.



పునిత (పాతచిత్రం)

హోటల్ యజమానిపై దాడి

కోయంబత్తూర్, న్యూస్‌టుడే: పరోటాకు తగినంత కూర వేయలేదన్న కోపంతో ఓ హోటల్ యజమానిపై వినియోగదారులు దాడి చేసిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. కోయంబత్తూరు కోట్టై ఈశ్వరన్ ఆలయ వీధిలోని ఓ హోటల్‌కు వెళ్లిన ఇద్దరు వినియోగదారులు తాము తీసుకున్న పరోటాకు కూర వేయలేదని యజమాని అమానుల్లాహ్‌తో గొడవకు దిగి దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన అతన్ని సిబ్బంది ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.